పురుడుకు పుట్టెడు కష్టాలు

- చిప్పగిరి 24 గంటల ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు అంతంత మాత్రమే
- ప్రసవాలకు పక్క జిల్లాలకు వెళ్లాల్సిందే
- రాత్రి పూట నొప్పులొస్తే అవస్థలు తప్పవు
- ఆరు నెలల్లో 72 కాన్పులు మాత్రమే చేసిన వైద్యులు
- సమీప ఆసుపత్రుల్లో పురుడు పోసుకున్న 354 మంది
- బాలింతలకు పాలు, బ్రెడ్డుతో సరిపెడుతున్న వైద్యాధికారులు

అది 24 గంటల ఆసుపత్రి.. పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది.. అన్ని రకాల వసతులు.. అయినా వైద్య సేవలు అంతంత మాత్రమే. ప్రసవం కోసం వెళ్తే వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేక సమీప ఆసుపత్రులకు వెళ్లాల్సిన దుస్థితి. రాత్రి పూట ప్రసవ నొప్పులతో వస్తే మాత్రం అంతే సంగతులు. దీంతో మండలంలోని అధిక శాతం గర్భిణులు గుంతకల్లు, సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇక అక్కడే ప్రసవించిన వారికి భోజనం పెట్టరనే ఆరోపణలున్నాయి. అలాగే బాలింతలను 48 గంటలు గడవకముందే ఇంటికి పంపుతుండటంతో ఆరోగ్య సమస్యలతో ఇతర ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఇదీ చిప్పగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరిస్థితి.

చిప్పగిరి: స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు నిర్లక్ష్యం కారణంగా మండలంలోని గర్భిణులకు, బాలింతలకు వైద్యం సక్రమంగా అందడం లేదు. దీంతో పురుడు పోసుకునేందుకు ఇతర ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన దుస్థితి. పీహెచ్‌సీలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ఒక సీహెచ్‌ఓ, సీనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్‌తో పాటు ఇతర సిబ్బందితో కలిపి దాదాపు 16 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి తోడు మండలంలో 33 మంది ఆశా వర్కర్లు, ప్రతి సచివాలయంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలతో కలిపి 8 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఇంత మంది వైద్య సిబ్బంది ఉన్నా గర్భిణులకు నాణ్యమైన వైద్యం అందడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

సెలవు రోజుల్లో వస్తే.. అంతే..

ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారాలు, ఇతర సెలవు దినాలతో పాటు ప్రతి రోజూ రాత్రి పూట వైద్య సేవలు అందించడానికి ఉన్నతాధికారులు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదు. ముఖ్యంగా రాత్రి పూట ప్రసవాలకు వచ్చే గర్భిణులు వైద్యులు అందుబాటులో లేక పక్కనే ఉన్న అనంతపురం జిల్లా గుంతకల్లుకు వెళ్లాల్సిన పరిస్థితి.



వైద్యం కోసం నిరీక్షిస్తున్న గర్భిణులు (ఫైల్)

ఇక సాయంత్రం 5 దాటితే డెలివరీలకు, అన్ని రకాల వైద్యసేవలకు స్టాఫ్ నర్సులే దిక్కు. పలు సందర్భాల్లో రాత్రి పూట వీరు కూడా అందుబాటులో ఉండకపోతుండటంతో గర్భిణులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. మండలంలో 16 గ్రామాలు ఉండగా అధికారిక లెక్కల ప్రకారం ఈ సంవత్సరం జనవరి నుంచి జూలై వరకు ఆరు నెలల్లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేవలం 72 మంది మాత్రమే డెలివరీ కాగా.. గుంతకల్లు, సమీప ప్రభుత్వాసుపత్రుల్లో 212 ప్రసవించారు. 142 మంది ఇతర ప్రైవేటు ఆసుపత్రిల్లో కాన్పులు చేయించుకున్నారు. స్థానిక వైద్యశాలలో జనవరిలో 10, ఫిబ్రవరిలో 13, మార్చిలో 7, ఏప్రిల్‌లో 3, మే లో 14, జూన్‌లో 11, జూలైలో 14 ఇలా కేవలం 72 మందికి మాత్రమే ప్రసవాలు చేశారంటే.. మండలంలో ఎలాంటి వైద్యసేవలు అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

నామ మాత్రంగా సేవలు..

సబ్ సెంటర్లలో సేవలందించాల్సిన సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉండటం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. కేవలం అధికారుల పర్యటన ఉన్నప్పుడు మాత్రమే ఈ సబ్ సెంటర్లు తెరుస్తారని, మిగతా సమయాల్లో మూసి ఉండటంపై పలుగ్రామాల ప్రజలు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. సీజనల్ వ్యాధులకు చికిత్స కోసం సబ్ సెంటర్లకు వెళ్తే వైద్యులు అందుబాటులో లేక ప్రజలు గ్రామాల్లోని ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. దీనికి తోడు కొన్ని గ్రామాల్లోని వైద్య సిబ్బంది గర్భిణులను డెలివరీలకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లకుండా వారికి అనుకూలంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లేలా పురామయించి పేదల ఆర్థిక ఇబ్బందులకు కారణం అవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చిప్పగిరి

బువ్వ కరువు..

స్థానిక ఆరోగ్య కేంద్రంలో డెలివరీ అయిన వారికి భోజన సదుపాయం కల్పించాల్సి ఉండగా కేవలం పాలు, బ్రెడ్డు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారు. ఆరోగ్య కేంద్రం దగ్గరలో ఎలాంటి భోజన హోటళ్లు లేక నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో డెలివరీ అయిన వారిని 48 గంటలు దాటక ముందే ఇళ్లకు పంపించి వేస్తుండడంతో బాలింతలకు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉండాలి



మండలంలోని గర్భిణులకు, బాలింతలకు వైద్య సేవలు, అత్యవసర సేవలు అందించడానికి 24 గంటలూ వైద్యులు, సిబ్బంది ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలి. ముఖ్యంగా రాత్రి పూట ప్రసవాల నిమిత్తం వచ్చే గర్భిణులు వైద్యులు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. వైద్యులు లేక ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ నిరుపేదలైన మహిళలు అప్పుల పాలవుతున్నారు. రాత్రి పూట వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– జూటూరు హేమలత, ఎంపీపీ

బాలింతల అభీష్టం మేరకే పాలు,బ్రెడ్డు పంపిణీ



ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం అయిన బాలింతల అభీష్టం మేరకే పాలు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్నాం. డెలివరీ అయిన రోజు భోజనం అందించడం ద్వారా డెలివరీ అయిన మహిళలకు పలు అనారోగ్య సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున ఎక్కువగా పాలు, బ్రెడ్డు తీసుకుంటారు. ప్రతి శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గం వరకు గర్భిణులకు అవసరమైన వైద్యసేవలు అందిస్తున్నాం. మండలంలోని గ్రామాల్లో గర్భిణులను ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్తున్నట్లు మా దృష్టికి వస్తే విచారణ చేసి సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. ప్రసవాలకు సంబంధించి దాదాపు అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి.

– షేక్ అఫ్రోజ్ జాన్, మెడికల్ ఆఫీసర్

క్లుప్తంగా

వైభవంగా భీమలింగేశ్వర స్వామి కల్యాణం



రుద్రహోమంలో పాల్గొన్న పండితులు, భక్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో భీమలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గ్రామంలోని అన్నపూర్ణ సమేత భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం గణపూజతో ప్రారంభించి స్వామికి రుద్రాభిషేకం జరిపించారు. నవగ్రహ పూజ అనంతరం సకల దేవతల సహకార రుద్ర హోమం, అమ్మవార్లకు భక్తుల సమక్షంలో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం వనభోజనం, సాయంత్రం లక్ష దీపోత్సవం జరిగింది. భక్తులు కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



విద్యార్థినికి రక్త పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

మద్దికెర : చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వైద్యసిబ్బంది గాయత్రి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ వైద్యాధికారులు శ్రీలక్ష్మి, రాగిణి ఆదేశాల మేరకు విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించి వయస్సుకు తగ్గ ఎత్తు, రక్త పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ.. భోజనం చేయడానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం వడ్డించాలి



వంటను పరిశీలిస్తున్న తహసీల్దారు సతీష్

హొళగుంద: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండి వడ్డించాలని తహసీల్దారు సతీష్ వంట నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం కోగిలతోట, ముద్దటమాగి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. భోజన సమయంలో విద్యార్థులకు తాగునీటి వసతి, ఇతర సదుపాయాలు కల్పించాలని సూచించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి బోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. టీచర్ల కొరత ఉందని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

దోమల నివారణకు చర్యలు



ఆలూరులో మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్న సిబ్బంది

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా గ్రామ పంచాయతీ, వైద్యారోగ్య సిబ్బంది దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని వివిధ కాలనీల్లోని మురుగు కాలువలు, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ఆయిల్ బాల్స్ వేయడం వల్ల దోమల లార్వా వృద్ధి చెందదని పంచాయతీ అధికారులు తెలిపారు. ఏఎన్‌ఎం యశోద, పంచాయతీ సిబ్బంది వరుణ్ పాల్గొన్నారు.

వరికోత మిషన్ బోల్తా



హొన్నూరు కొట్టాల సమీపంలోని పొలంలో బోల్తా పడిన వరికోత మిషన్

హొళగుంద: మండలంలోని హొన్నూరు కొట్టాల సమీప పొలంలో శుక్రవారం వరి కోతలు కోస్తున్న కోత మిషన్ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. వరి పంటను కోత కోసేందుకు పొలంలోకి వెళ్తున్న సమయంలో దారి చిన్నదిగా ఉండడంతో మిషన్ ఒకసైడు ఒరిగి కింద పడింది. వెంటనే డ్రైవర్ కిందకు దూకడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు.

భక్తిశ్రద్ధలతో చండీ యాగం



పత్తికొండ కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలందుకున్న అమ్మవారు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

పత్తికొండ(తుగ్గలి): పట్టణంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో పండితుల వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా క్రతువును జరిపించారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు చేశారు. అయ్యప్ప మాలధారులు, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చండీయాగం విశిష్టతను పండితులు వివరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించండి

చిప్పగిరి: సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని పీఆర్ డీఈ మనోహర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని బేల్డోణ గ్రామంలో రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు మండలానికి రూ.1.80 కోట్ల ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో మండలంలోని 16 గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచుల అభ్యర్థన మేరకు అవసరమైన కాలనీల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు చెప్పారు. ఏఈ సోమన్న, సర్పంచ్ కరివేముల సావిత్రి,గోవిందు పాల్గొన్నారు.



బెల్డోణలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈ మనోహర్

గుంతలు పడి.. కంకర తేలి..

హాలహర్వి: మండలంలోని మాచనూరు–హాలహర్వి నాలుగు కి.మీ. రహదారి అధ్వానంగా మారింది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2009లో వేసిన తారు రోడ్డు కంకర తేలి గుంతలమయమవడంతో వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితి. వర్షాకాలంలో రోడ్డు బురదమయంగా మారుతుందని, కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంటుందని మాచనూరు గ్రామస్తులు ప్రహ్లాద, రంగముని వాపోయారు. సంబంధిత అధికారులు రోడ్డుకు మరమ్మతులైనా చేపట్టాలని కోరారు.



అధ్వానంగా మారిన మాచనూరు–హాలహర్వి రహదారి

విద్యార్థులకు నీటి కష్టాలు

చిప్పగిరి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వారం రోజుల నుంచి తీవ్ర నీటి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పాఠశాలలో మొత్తం 638 విద్యార్థులు ఉన్నారు. పాఠశాల మొత్తానికి పంచాయతీ ద్వారా గ్రామంలోకి వదిలే నీరే శరణ్యం. అయితే పాఠశాలకు సరఫరా చేసే మంచి నీటి పైప్‌లైన్‌లో సమస్య తలెత్తడంతో మినీ ట్యాంకుకు నీరు రావడం లేదని ప్రధానోపాధ్యాయుడు లతీఫ్ తెలిపారు. పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పాఠశాల లోని బోరు నీటినే విద్యార్థులు తాగుతున్నారని చెప్పారు.



చిప్పగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వృథాగా మారిన మినీ వాటర్ ట్యాంకు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు అరుణజ్యోతి, వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు ఉచిత స్కీనింగ్, ఎత్తు, బరువు, ఛాతికొలత, హిమోగ్లోబిన్, కంటి జబ్బులు, పంటికి సంబంధించిన సమస్యలు, అలాగే పుట్టుకతో వచ్చే 4డీ లోపాలు, తరచూ వచ్చే రోగాలు, వయస్సుకు తగ్గ శారీరక, మానసిక పెరుగుదల, అంగవైకల్య లక్షణాలు గుర్తించి అవసరమైన చికిత్సలు చేస్తామన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి రంగస్వామి ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

హొళగుంద: స్థానిక పెద్ద చెరువు వద్ద బాగోడి చిన్న మారెన్నకు చెందిన గడ్డివాము శుక్రవారం ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. మధ్యాహ్న సమయంలో గడ్డివాముకు ఉన్నట్టుండి మంటలు అంటుకోవడంతో స్థానికులు ఆర్పడానికి ప్రయత్నించారు. దాదాపు 6 ఎకరాల గడ్డి పాక్షికంగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న వీఆర్‌ఓ తిప్పన్న ప్రమాదం గురించి తెలుసుకున్నారు.

బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ చేసుకోండి

ఆలూరు: ప్రభుత్వం మంజూరు చేసే సంక్షేమ పథకాలను లబ్ధి పొందాలంటే బ్యాంకు ఖాతాకు తప్పనిసరిగా ఆ ధార్ కార్డును, ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని ఆలూరు సబ్ పోస్టుమాస్టారు నాగరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏబ్యాంకులో ఖాతా ఉన్నప్పటికీ ఆధార్ కార్డు లింక్ కాకపోతే స్థానిక పోస్టాఫీసులో చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయని చెప్పారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

దేవనకొండ: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌పీవో వీరభద్రప్ప అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఈఓఆర్‌డీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రంగా ఉంచడంలో పంచాయతీ కార్యదర్శులు కీలక పాత్ర వహించాలని ఆదేశించారు. మురికివాడల్లో నీరు నిల్వ ఉండకుండా, కాలువల్లో చెత్తాచెదారాలు నిండకుండా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్ జీతాలు మంజూరు చేయండి

ఆలూరు: హలహర్వి మండలం చింతకుంట గ్రామ ఎస్ఎస్ ట్యాంకు నుంచి దాదాపుగా 20 గ్రామాలకు తాగునీటిని విడుదల చేస్తున్నామని, పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్యను ఒప్పంద కార్మికులు శుక్రవారం నిలదీశారు. వారు మాట్లాడుతూ...గత ఏడాది నుంచి మీపై నమ్మకంతో జీతాలను మంజూరు చేయకపోయినా అలాగే పనిచేస్తున్నామని ఇక నుంచి తాము చేయలేమని తేల్చి చెప్పారు. తమకు వెంటనే జీతాలు చెల్లించాలని కార్మికులు వీరేష్, రాఘవ, వెంకటేష్, సోమన్నగౌడు,జాకీర్ డీఈతో వాదనకు దిగారు. అనంతరం డీఈ మాట్లాడుతూ గత ఏడాది క్రితం ఆదోని పట్టణ కేంద్రాకి చెందిన శ్రీకాంత్‌ప్రసాదు అనే వ్యక్తి చింతకుంట ఎస్ ఎస్ ట్యాంకు నిర్వహణ కాంట్రాక్టు తీసుకున్నారన్నారు. అయితే పనులు దక్కించుకున్నప్పటి నుంచి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేయలేదన్నారు. అందుకు చిప్పగిరి మండలం బెల్డోణ గ్రామానికి చెందిన నాగేంద్రప్ప కు జిల్లా అధికారులు ఆదేశాల మేరకు తాగునీటి సరఫరా బాధ్యతలను అప్పగించామన్నారు. ఆయనకు బిల్లులు మంజూరైన వెంటనే మీకు పెండింగ్‌లో ఉన్న జీతాలను ఇవ్వాలని సూచించామని చెప్పారు.



ఒప్పంద కార్మికులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మల్లికార్జునయ్య

సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలి

హొళగుంద: వివిధ రకాల మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ బాల నరసింహులు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్, తనూజ, సుమౌర్య ప్రైవేటు డిగ్రీ కళాశాల, నేతాజీ పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు, అవగాహన కలిగించేందుకు కరపత్రాలను అందజేశారు. ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి బ్యాంక్ అకౌంట్, పాస్‌వర్డ్ అడిగితే చెప్పరాదన్నారు. గుర్తు తెలియని వ్యక్తులకు డబ్బులు పంపి మోస పోవొద్దని, అలాంటి ఫోన్ కాల్స్ వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఐ బాల నరసింహులు, ఉపాధ్యాయులు



చలిమంట కాచుకుంటున్న దృశ్యం



మద్దికెర వద్ద పొలాలను కమ్మేసిన పొగమంచు

చలి పంజా!

మద్దికెర : గత నాలుగు రోజులుగా చలి పులి విజృంభిస్తుండడంతో జనాలు ఇళ్లకే పరిమితమవుతున్నారు. శుక్రవారం మండల కేంద్రం మద్దికెరలో చలితో పాటు శీతల గాలులు అధికంగా వీయడంతో జనం తట్టుకోలేక చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. మండలంలో 17 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. సాయంత్రం నుంచే చలి ప్రారంభమవుతుందని, ఇక పొగమంచు తీవ్రంగా ఉండటంతో ఉదయం ఎనిమిది గంటలైనా భానుడు బయటికి రాలేకపోతున్నాడు. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు.

జాబ్‌మేళాలో 18 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 18 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఐటీఎం స్కిల్ అకాడమీ, బీఎంఎస్ సెక్యూరిటీ సంస్థల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 40 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 18 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ తెలిపారు.



రాంపల్లి ఎక్స్ రోడ్డు సమీపంలో వరి పంట కోస్తున్న కూలీలు



ముక్కెల్లలో వరి పంట నూర్పిడి చేస్తున్న దృశ్యం

చి'వరి'లో అలజడి

తుగ్గలి : తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో అన్నదాతలు అప్రమత్తమయ్యారు. ఇంటిల్లిపాదీ పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. మండలంలో బోరుబావులు, బొందిమడుగుల, ముక్కెల్లలో చెరువులు, కుంటల కింద మొత్తం 96 హెక్టార్లలో వరి పంట సాగైంది. పంట కోత దశకు రావడంతో వరి కోతలు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాలు కురవనున్నయనే నేపథ్యంలో రైతులు వరి కోతలు చేసి కుప్పలుగా పెట్టుకుంటున్నారు. మరికొందరు మిషన్‌తో నూర్పిడి చేసే పనిలో నిమగ్నమయ్యారు.

షష్టి ఉత్సవాలకు భిక్షాటన

మద్దికెర : స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో డిసెంబర్ 6, 7,8 తేదీల్లో నిర్వహించే షష్టి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారి భక్తులు మండల కేంద్రంలో భిక్షాటన చేసినట్లు ఆలయ నిర్వాహకులు విజయ్ తెలిపారు. భిక్షాటనలో వచ్చిన సొమ్ము, ధాన్యంతో మూడు రోజుల పాటు ఉత్సవాల్లో భక్తులు అన్నదానం చేస్తారని చెప్పారు.